### అమృత్ కిరణ్ కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# పండుటాకు

-పురిజాల సుధాకర్

బిఇడి ప్రాక్టికల్ ఎగ్జామ్స్ నిర్వహించే నిమిత్తం ఆ ఊరు బిఇడి కాలేజీకి ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వెళ్ళాను.

ప్రాక్టికల్స్ మూడు రోజులు.

హోటల్‌లో రూమ్ తీసుకున్నాను.

హోటల్ అన్ని విధాలా సౌకర్యంగా ఉంది.



నా పక్కరూమ్‌లో ఓ అరవై ఏళ్ళ వ్యక్తి పరిచయం అయ్యాడు ఆ మొదటి రోజే-

రెండు-రోజులు గడిచాయి.

ఆ రోజు ప్రాక్టికల్స్ అయిన వెంటనే రూమ్‌కొచ్చి హాయిగా స్నానం చేసి రిఫ్రెష్ అయ్యాను.

రెండు రోజులుగా ఆ వ్యక్తిని నేను గమనిస్తూనే ఉన్నాను.

ఆయన్లో ఏదో అశాంతి కనిపిస్తోంది.

నాతో మాట్లాడడానికి ఈ రెండు రోజుల చనువూ చాలు.

అందుకేనేమో... నేను రిఫ్రెష్ అయి కూర్చున్నప్పుడు ఆయన వచ్చాడు.

"రండి...రండి..." సాదరంగా ఆహ్వానించాను.

ఆయన కూర్చున్నాడు.

నన్ను చూసిన ఆయన్లో ఏదో ఉత్సాహం.

అయినా-

అంతలోనే-

నిరాశగా, నిస్పృహగా మారిపోయింది ఆయన మొహం.

నా వివరాలన్నీ అడిగారు.

చెప్పాను.

నేనూ అడిగాను.

ఆయన చెప్పడం మొదలు పెట్టాడు.

"నేను ఒక రిటైర్డ్ ఆఫీసర్‌ని బాబూ... నాకు భార్యా, ఒక కొడుకూ, ఒక కూతురూ సంతానం. కూతురికి నేను జాబ్‌లో ఉండగానే పెళ్ళి చేసేశాను. అల్లుడూ కూతురూ ఢిల్లీలో ఉంటున్నారు. ఇకపోతే నా కొడుకు ఎమ్.ఏ. పాస్

అయ్యాడు. జులాయిగా తయారయ్యాడు. ఉద్యోగం ప్రయత్నమే చేయడు.

నేను సంపాదించినది ప్రత్యేకంగా ఏమీ లేకపోయినా సరే, నా కొచ్చిన పెన్షన్, గ్రాడ్యుయిటీ అన్నీ కలిపి లక్షరూపాయిలు పైనే వచ్చాయి.

లక్ష రూపాయలుపెట్టి మంచి ఇల్లు కట్టాను.

మిగిలిన పాతికవేలూ బ్యాంక్‌లో వేశాను.

అంతిల్లు కట్టించి, నేను మోసుకుపోతానా? నా కొడుకు కోసమేకదా!

కానీ...

వాడికా ఇంగితజ్ఞానం లేదు.

అంత ఇంటిలో నాకు కనీసం వేడినీళ్ళు పెట్టిచ్చే నాధులు లేరు.

పని మనుషుల్ని పెట్టాను.

కానీ, వాళ్ళకి నేను యజమానిని కాను. నా భార్యే యజమానురాలు.

ఇంచుమించు వాళ్ళూ నా మాట వినడం మానేశారు.

నా భార్యా, కొడుకూ నన్ను పట్టించుకోరు సరిగదా... హీనంగా చూస్తారు.

కనీసం ఏదైనా తినాలని ఉన్నా ఏమీ చెయ్యదు నా భార్య. నా ఒళ్ళు నొప్పులుగా ఉన్నా కనీసం జండూబామ్ రాయదు. నేను డాక్టర్ దగ్గరకి వెళ్ళినా నన్ను కనీసం నా పళ్ళు కొన్ని ఊడిపోయాయి. కాని, నేను తినకూడదనే పకోడీలు, చేగోడీలు చేసుకుని తింటుంటారు.

నాకోసం ఏవైనా మెత్తని తినుబండారాలు చెయ్యొచ్చు గదా. అస్సలు చెయ్యరు.

ఈ వయసులో ముసలివాళ్ళూ, పసిపిల్లలూ ఒకటే అంటారు గదానాయనా... కానీ, ఆమె నాకంటే ఆరేళ్ళే చిన్నది. అయినా ఆమె నన్ను పట్టించుకోడం మానేసింది.

ఇకపోతే, నా పుత్రరత్నం-

బ్యాంక్‌లో వేసిన పాతికవేలూ మర్యాదగా నాకియ్యి లేకపోతే చంపేస్తాను అని నా పీక పట్టుకున్నాడు ఆఖరిగా-

వాడికి వాళ్ళమ్మ అన్ని విధాలా సపోర్టు.

వాళ్ళిద్దరూ-

ఒకటైపోయి-

నన్ను చంపెయ్యడానికి-

రకరకాల ప్లాన్లు వేస్తున్నారు.

కాబట్టి-

నేనీ ఊళ్ళో 'రూమ్' తీసుకుని ఉంటున్నాను.

ఇప్పుడు-

హాయిగా-

తెల్లారేసరికి వేడినీళ్ళు ఇస్తున్నారు.

బార్బర్ వచ్చి మర్దన చేస్తున్నాడు.

కాళ్ళూ వేళ్ళూ పడుతున్నాడు.

క్లాత్‌వాషర్ నీట్‌గా వాష్ చేస్తున్నాడు.

బాయ్‌వచ్చి టిఫిన్స్, కాఫీలు ఏరేంజ్ చేస్తున్నాడు.

ఇంకా-

కావలసినవన్నీ తెస్తున్నాడు.

టి.వీ. ప్రోగ్రామ్స్‌లో కొన్ని హేపీగా చూస్తున్నాను.

డాక్టర్ దగ్గరకి పర్సనల్‌గా వెళ్ళి హెల్త్ కండీషన్ చెక్ చేయించుకుంటున్నాను.

హోటల్ మీల్స్ డబ్బు పోయినా బాగానే ఉంటోంది.

నాకు నచ్చినవే హాయిగా తింటున్నాను.

నా భార్యా కొడుకు దగ్గర లభించని సుఖసౌర్యాలు నేను ఈ ఊళ్ళో ఈ హోటల్ ద్వారా పొందుతున్నాను.

బహుశాః నా గురించి కాకపోయినా నా డబ్బు గురించి ఈ పాటికి వాళ్ళు 'అన్వేషణ' చేయడం మొదలుపెట్టే ఉంటారు.

మా ఊరికి ఇంతదూరంగా వచ్చేసిన నేను వాళ్ళకి అంతతొందరగా దొరకను.

"మరి ప్రతినెలా మీ పెన్షన్?" అడిగానునేను.

"నాకు అనుకూలమైన ఊరికి ట్రాన్స్‌ఫర్ చేయించుకునే ఏర్పాట్లు చాలా రహస్యంగా, పకడ్బందీగా చేయించుకుంటున్నాను." అన్నారాయన.

బ్యాంక్‌లో పాతికవేలూ డ్రా చేసి తెచ్చేసుకున్నాను.

హాయిగా ఇక్కడ బ్యాంక్‌లో వేసుకున్నాను.

ప్రస్తుతానికి అది ఖర్చు పెట్టుకుంటున్నాను.

"ఇక ఆ ఊరికి వాళ్ళ దగ్గరికి వెళ్ళను" బాధగా అన్నారు.

"మీ భార్య ప్రవర్తన ఎందుకలా ఉంది? మీరేమైనా పొరపాట్లు చేశారా... నిజం చెప్పండి..." అడిగాను.

"లేదు బాబూ... ఆమెని మనః పూర్వకంగా ప్రేమించాను. ఆమెని కష్టపెట్టే ఒక్కమాటా ఏనాడూ అనలేదు. నా ప్రేమనీ అభిమానాన్నీ ఆమె అలుసుగా తీసుకుంది.

నా కొడుక్కీ కామన్‌సెన్స్ లేదు. కానీ. ఆమెకే లేకపోవడంతో, బ్రతుకు భయంతో నేనీ నిర్ణయం తీసుకుంటున్నాను."

ఆయన కనుకొలకుల్లో చిమ్మిన కన్నీరు.

"భగవాన్... వృద్ధాప్యంలో భర్తని ఇంత దారుణంగా, హీనంగా, అలుసుగా, పురుగులాచూసే వాళ్ళున్నారా?"

నా ఆశ్చర్యానికి అంతులేదు.

"ఉన్నారు బాబూ... పండుటాకుల్ని పట్టించుకోని కొడుకులూ, కూతుర్లేకాదు... నా భార్యలాంటి నీచురాళ్ళూ ఉన్నారు...

నాకైతే...

కనీసం...

నాపెన్షన్ అయినా ఉంది.

మరి-

అదికూడాలేని వృద్ధులు ఎన్ని చిత్రహింసలకూ ఛీత్కారాలకూ 'గురి' అవుతున్నారో!

ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో!"

ఆతని పెదవిపై విషాదంతోకూడిన చిరునవ్వు.

నిజమే అనిపించింది నాకు.


పురిజాల సుధాకర్
సోషల్‌స్టడీస్ లెక్చరర్, బిఇడి కాలేజ్,
మునసబ్ పేట, వయా: అరసవిల్లి
శ్రీకాకుళం జిల్లా - 532 401.


★

## పరిచయం

పేరు : పురిజాల సుధాకర్

తల్లిదండ్రులుః శ్రీమతి సూర్యకాంతమ్మ, నారాయణమూర్తి

గ్రామం : వావాం, శ్రీకాకుళం - జిల్లా

పుట్టినతేది : 17-05-1955

విద్యార్హతలుః ఎమ్మే (డబుల్)

ఉద్యోగం : లెక్చరర్ బి.ఇడి. కాలేజ్ (శ్రీకాకుళం)

రచనలు : 1980 నుండి కథలూ, కవితలూ, వ్యాసాలూ, రేడియో ప్రోగ్రామ్స్, పాటలూ, పద్యాలూ మొదలైనవి.

మొదటి కథః 1981లో ఆంధ్రప్రభలో 'లవ్‌లెటర్' కథ

భార్య : కృష్ణకుమారి

చిరంజీవులుః శిరీష, సంపత్‌కుమార్

ఆసక్తి : మంచి రచనలు మాత్రమే చేయాలని

అభిమానులుః మంచి రచనచేసిన ఎవరైనా సరే...

నా కథ ప్రచురణకు స్వీకరించిన అమృత్ కిరణ్‌కు కృతజ్ఞతలు



పురిజాల సుధాకర్